క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం వంటి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఆస్పత్రికి మానసిక రోగి తరలింపు



మానసిక రోగిని ఆస్పత్రిలో చేర్చుతున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో ప్రజలను భయాందోళనలకు గురి చేసిన ఓ మానసిన రోగిని పెందుర్తి పోలీసులు చికిత్స నిమిత్తం నగరంలోని మానసిన వైద్యశాలకు తరలించారు. వివరాలివి.. పెందుర్తి జూనియర్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఓ వ్యక్తి కొద్దిరోజులుగా సంచరిస్తున్నాడు. తన చేష్టలతో స్థానికులను భయపెడుతున్నాడు. దీనిపై స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సీఐ కె.వి సతీష్‌కుమార్ బ్లూకోట్స్ పీసీ చంద్రశేఖర్‌ను శనివారం అక్కడికి పంపారు. మానసిక వికలాంగుడిని పట్టుకుని వెంటనే నగరంలోని ప్రభుత్వ మానసిక రోగుల ఆసత్రికి తరలించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



భక్తులకు వడ్డన చేస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సాయినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనను కార్పొరేటర్ శానాపతి వసంత, నాయకుడు శానాపతి శంకర్రావు ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. బాబాను ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక పెద్దలు దర్శించుకున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు అర్చకులు ద్వాదశి సోదరులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7.30 నుంచి స్వామికి విశేష అభిషేకాలు, గణపతి, రుద్ర హోమాలు, స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతాయన్నారు. భక్తులంతా పాల్గొని తరించాలని కోరారు.

సహజసిద్ధ అందాలు.. నిర్లక్ష్యపు లోగిళ్లు



తిక్కవానిపాలెం తీరంలో నిర్మించిన సిమెంట్ గొడుగులు

- సందర్శకులను కట్టిపడేస్తున్న తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు
- రవాణా, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సదుపాయం లేక పర్యాటకుల ఇక్కట్లు
- తాగునీటి కోసం కిలోమీటర్ల మేర దూరం పోవాల్సిందే
- నిలువ నీడ లేక ఉసూరుమని వెనుదిరుగుతున్న ప్రకృతి ప్రేమికులు



సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఎన్టీపీసీ జెట్టీ

పరవాడ: మండలంలో తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇసుక దిబ్బలు, తిక్కవానిపాలెం తీరంలో సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన అతి పొడవైన జెట్టీ, పర్యాటకులు సేద దీరేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ గొడుగులు, తీరం చుట్టూ పచ్చని జీడి, సరుగుడు తోటలు, పచ్చని చెట్లతో నిండిన కొండ కోనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ సోయగాలను వీక్షించడానికి ఉమ్మడి విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. అయితే తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన కనీస సదుపాయాలైన రవాణా, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ వంటి సదుపాయాలు కానరాక సందర్శకులు వచ్చిన తోవనే వెనుదిరుగుతున్నారు. ఈ రెండు తీర ప్రాంతాలకు సరైన రవాణా సౌకర్యం లేదు. ఇక్కడికి చేరుకోవాలంటే ఆటోలు, ద్విచక్ర వాహనాలే దిక్కు. తీరా వెళ్లాక కనీసం దప్పిక దీర్చుకోవడానికి తాగునీరు కూడా అందుబాటులో ఉండదు. దాని కోసం మళ్లీ కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. ఎండా వానల నుంచి కాపాడుకోవడానికి ఎన్టీపీసీ జెట్టీ, చిన్నపాటి సిమెంటు గొడుగులే పెద్ద దిక్కుగా మారాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన సిమెంటు గొడుగులకు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్నాయి. కాసేపు విశ్రాంతి తీసుకుందామంటే కనీసం తీరంలో ఎక్కడా బెంచీలు కూడా కానరావు. మహిళలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీస వసతులు లేక చెట్ల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి. చీకటి పడితే చాలు తీర ప్రాంతాల చుట్టూ అంధకారం అలముకుంటుంది. గతంలో ఎన్టీపీసీ యాజమాన్యం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాల వెలుగుల్లో తీర ప్రాంతాల అందాలు తిలకించడానికి వీలుండేది. కానీ ఆ వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. ఉప్పు గాలికి పాడైనవి కొన్నయితే మరికొన్ని విద్యుత్ స్తంభాలను దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ఫలితంగా తీర ప్రాంతాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానికులు తీర ప్రాంతాలను శ్మశాన వాటికలుగా ఉపయోగిస్తుండడం వల్ల పర్యాటకులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. సముద్ర స్నానాలు చేసేటప్పుడు ప్రమాద నివారణకు ఏర్పాటు చేసిన పోలీసు పికెట్ ఎత్తివేయడంతో తరచూ యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. తీర ప్రాంతాల్లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలను అభివద్ధి చేస్తే సందర్శకులు క్యూలు కట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు చొరవ చూపితే బాగుంటుందని పర్యాటకులు సూచిస్తున్నారు.



ముత్యాలమ్మపాలెం తీరం సమీపంలో పచ్చని చెట్లతో నిండిన కొండలు



తిక్కవానిపాలెం తీరంలో పర్యాటకులను కట్టిపడేసే ఇసుక దిబ్బలు



పర్యాటకులను ఆకట్టుకుంటున్న సువిశాలమైన సముద్ర తీరం



బీటలు వారుతున్న సిమెంట్ గొడుగుల అడుగు భాగం

తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి..



ప్రకృతి అందాలకు నెలవైన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. కనీస సౌకర్యాలు లేక పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు కూర్చోవడానికి బెంచీలు కూడా లేక నిరాసతో వెనుదిరుగుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సూరాడ చంద్రారావు, తిక్కవానిపాలెం

నిలువ నీడ లేదు...



దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి తీర ప్రాంత అందాలు తిలకించడానికి వచ్చే వారికి కనీసం సేదదీరడానికి నిలువ నీడ కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. తీర ప్రాంత అందాలు కనువిందు చేస్తున్నాయి. కానీ పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నాం. మంచినీరు, బెంచీలు, టాయిలెట్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తే సందర్శకులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– కొత్తపల్లి సురేష్, సందర్శకుడు

ప్రకృతి అందాలను కాపాడాలి..



తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో కొండ కోనలు, సరుగుడు, జీడి మామిడి తోటలు, సహజసిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలు, అతి పొడవైన ఎన్టీపీసీ జెట్టీ ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు, పెద్దలను ఆకట్టుకునే ప్రకృతి అందాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఇక్కడ సౌకర్యాలు కల్పించడానికి పర్యాటకశాఖ అధికారులు ముందుకు రావాలి.

– వెన్నల సన్యాసిరావు, సందర్శకుడు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నాయుడుపాలెంలో యోగా చేస్తున్న ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు



ముత్యాలమ్మపాలెంలో యోగా చేస్తున్న సర్పంచ్ సుజాత తదితరులు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం సర్పంచులు కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, చింతకాయల సుజాత మాట్లాడుతూ యోగా నిత్య జీవితంలో ఓ భాగం కావాలని సూచించారు. యోగా వల్ల వివిధ వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. ఈ నెల 21 నుంచి జూలై 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం పంచాయతీల కార్యదర్శులు త్రినాథ్, రజిని, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం..

పెందుర్తి: యోగతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు అన్నారు. ఈ నెల 21న జరగనున్న జాతీయ యోగ దినోత్సవం.. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాంపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం యోగ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధి హామీ కూలీలు యోగాసనాలు వేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, పలు శాఖల సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..



పరవాడలో మినీవ్యాన్‌లో పదుల సంఖ్యలో ప్రయాణికులను తరలిస్తున్న దృశ్యం

పరవాడ: మండలంలో భారీ వాహనాలు, మినీ వాహనాలు, ఆటో, ద్విచక్ర వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఉదాసీన వైఖరి అవలంబించడం వల్ల వాహన చోదకుల ఇష్టారాజ్యమైపోయింది. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు మినీ వ్యాన్లు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. వీటిలో పరిమితికి మించి కార్మికులను తరలిస్తూ యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాన్లు, ఆటోల్లో నిలబడడానికి, కూర్చోవడానికి అవసరమైన స్థలం లేకపోయినా వాహన యజమానులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్నారు. కార్మికులను సమయానికి విధులకు అందించే క్రమంలో అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. కిక్కిరిసిన ప్రయాణం ప్రమాదమని తెలిసినా విధులకు వెళ్లే క్రమంలో కార్మికులు, ప్రజలు మినీ వ్యాన్లు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

ఆక్సిజన్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం పునర్నిర్మించాలి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి

పెందుర్తి: రెవెన్యూ అధికారులు ఇచ్చిన మాట ప్రకారం చినముషిడివాడ సమీపంలోని ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. విగ్రహంతో పాటు కాలనీలో పార్కు ఏర్పాటు చేస్తామని కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే, తహసీల్దార్ హామీ ఇచ్చిన నేపథ్యంలో గత 11 నెలలుగా జరుగుతున్న నిరసన దీక్షను విరమించామన్నారు. ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇక్కడి ప్రభుత్వ స్థలంపై బుర్రా రాజేష్ అనే వ్యక్తి కన్ను పడిందని ఆరోపించారు. గతంలో దళిత మహిళలు అని చూడకుండా దుర్భాషలాడినా అతనిపై చర్యలకు అధికారులు వెనుకాడారన్నారు. ఇకపై అలాంటి దుశ్చర్యలకు పాల్పడినా, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయాలని చూసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే ఆక్సిజన్ కాలనీ ప్రజలకు అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం నగర కో కన్వీనర్ టి.రూప, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటలక్ష్మి, యు.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలకు డిమాండ్



సమావేశమైన ప్రైవేటు జూనియర్ కళాశాలల జాయింట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు

సబ్బవరం: పుట్టగొడుగుల్లా వెలుస్తున్న గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు జూనియర్ కళాశాలల జాయింట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. జనార్దన్ కోరారు. సబ్బవరంలోని 4ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేకుండా కాలేజీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌ను రోడ్డున పడేయొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సబ్బవరంలో ఒక కళాశాల ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్‌తో పాటు ఇంటర్ బోర్డ్ కమిషనర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని, డీఐఈవో దృష్టికి తీసుకెళ్లడంతో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కె. నాగేశ్వరరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ. శేషగిరిరావు, బీశెట్టి మురళీప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు టి. మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా కిరణ్



సింహాచలం: సింహగిరి వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా ముగ్గు కిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యాపారులంతా శనివారం ఏకగ్రీవంగా ఎన్నికుని సత్కరించారు. కాగా కిరణ్ గతంలో కూడా సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. వర్తకుల సమస్యలపైన, నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలోను, సమస్యల పరిష్కారంలోను చురుగ్గా పని చేయడంతో మళ్లీ అధ్యక్షుడిగా వ్యాపారులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ సింహగిరి వర్తకుల సమస్యలు దేవస్థానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వర్తక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, వర్కర్స్ సంఘం అధ్యక్షుడు దాసరి పైడిరాజు, వర్తకులు దొంతల సత్తిబాబు, పండూరి మురళి, కుమారి, సూరిబాబు, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ అడిషనల్ బ్రేకర్ నిర్వహణలో భాగంగా గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, భోదువలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతను ఉపేక్షిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

పరవాడ: ఫార్మాసిటీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే సహించబోమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య పరిశ్రమల యాజమాన్యాలను హెచ్చరించారు. గొర్లివానిపాలెం లారస్ రీజినల్ కార్యాలయంలో పరిశ్రమ యాజమాన్యాలతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన సామగ్రిని వారికి సమకూర్చడానికి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రమం తప్పకుండా పరిశ్రమల్లో ఆడిట్లు, మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. భద్రత ప్రోటోకాల్‌పై కార్మికులకు శిక్షణ కల్పించాలన్నారు. పరిశ్రమల ప్రాంగణాల్లో ఉద్యోగులు, కార్మికులు రక్షణ పరికరాలు విధిగా ధరించాలన్నారు. ప్రమాదకర కార్యకలాపాలను అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలో భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. జేఎస్‌పీసీ మేనేజ్‌మెంట్ కార్మికుల భద్రత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను మేనేజ్‌మెంట్ ప్రతినిధి జె.సుబ్బారావు వివరించారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ, బ్రాయిలర్, జిల్లా పరిశ్రమల శాఖలు, జేఎస్‌పీసీ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



మృతులకు నివాళులర్పిస్తున్న నానాజీ తదితరులు

మల్కాపురం: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సామాజికసేవా కార్యకర్త పెద్దిరెడ్ల నానాజీ శనివారం నివాళులర్పించారు. 58వ వార్డు శ్రీహరిపురం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విమానం ప్రమాద ఘటనలో మన దేశీయులతో పాటు విదేశీయులు,చిన్నారులు ఉండడంచాలా బాధాకరం అన్నారు. ఇలాంటి ఘటన దేశంలో ఎప్పుడు చోటు చేసుకోలేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సాయం కేంద్రం అందించాలన్నారు.